CLASS 4 TERM-1

# తెలుగు భారతి

LESSON 2






CLICK HERE TO ACTIVATE


LESSON

# 2. తెలివి

ఒక పట్టణంలో ఒక ధనికుడు ఉన్నాడు. అతడికి వ్యాపారంలో నష్టం వచ్చి, ఆస్తిని అంతా పోగొట్టుకున్నాడు. పూలు అమ్మినచోట కట్టెలు అమ్మడం ఇష్టం లేక ఆ ఊరు వదిలి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అతడి ఇంట్లో తాతల కాలంనాటి ఒక ఇనుప త్రాసు ఉండేది. అది చాలా మంచిది. అటువంటి త్రాసు దొరకడం చాలా కష్టం. ఆ త్రాసును వదులుకోవడం ఇష్టం లేదు. దాన్ని తన స్నేహితుడైన ఒక వర్తకుని ఇంట్లో ఉంచి దేశ-దేశాలు తిరిగాడు. చాలా ధనం కూడా సంపాదించాడు.



కొన్ని సంవత్సరాలు తర్వాత తిరిగివచ్చి తన త్రాసును తనకు తిరిగి ఇవ్వమని ఆ వర్తకుణ్ణి అడిగాడు. కానీ వర్తకుడు త్రాసును కాజెయ్యాలని అనుకొన్నాడు. "నీ త్రాసును ఎలుకలు తినేశాయి !" అని ఆ ధనికుడితో చెప్పాడు. "అలాగా ! అయితే సరేలే !" అని ఆ తెలివిగల ధనికుడు అప్పటికి ఊరుకున్నాడు. కానీ ఆ వర్తకుడికి బుద్ధి చెప్పడానికి ఒక ఎత్తు వేశాడు.



ఒక రోజు ధనికుడు స్నానం చేయడానికి నదికి వెళుతూ ఆ వర్తకుడి కుమారుణ్ణి తనతోపాటు తీసుకొని వెళ్ళాడు. స్నానం చేసి తిరిగి వస్తూ ఆ పిల్లవాణ్ణి ఒకచోట దాచిపెట్టాడు. ఏడుస్తూ వర్తకుని దగ్గరకు వచ్చి "నీ కొడుకుని గ్రద్ద తన్నుకుపోయింది" అని చెప్పాడు.



అప్పుడు ఆ వర్తకుడు “దుర్మార్గుడా ! ఎక్కడైనా బాలుణ్ణి గ్రద్ద తన్నుకుపోతుందా ?” అని న్యాయాధికారి దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. న్యాయాధికారి ఆ ధనికుణ్ణి పిలిచి, “గ్రద్ద బాలుణ్ణి ఎలా తన్నుకుపోగలదు?” అని అడిగాడు. ఆ మాటకు ఆ ధనికుడు “ఇందులో అనుమానపడవలసింది ఏమీలేదు. ఈ నగరంలో ఇనుప త్రాసును తినే ఎలుకలే ఉంటే, బాలుణ్ణి ఎత్తుకుపోయే గ్రద్దలు ఉండవా ?” అని అన్నాడు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు. న్యాయాధికారి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నాడు. వర్తకుడిని మందలించి అతనికి పిల్లవాణ్ణి, ధనికుడికి త్రాసుని ఇప్పించాడు.

నీతి : తెలివి ఏ ఒక్కరి సొత్తుకాదు.

## అభ్యాసము

I. అర్థాలు :

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆస్తి | = | సంపద | కాజేయుట | = | దొంగిలించుట |
| నిర్ణయించుకొను | = | నిశ్చయించుకొను | ఎత్తు | = | పన్నాగం, ఉపాయం |
| వర్తకుడు | = | వ్యాపారి | దుర్మార్గుడు | = | చెడ్డవాడు |

II. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్క వాక్యంలో జవాబులు వ్రాయండి.

1. ధనికుడి ఇంట్లో ఏ కాలంనాటి త్రాసు ఉండేది ?
2. ధనికుడు పిల్లవాడిని ఏమి చేశాడు ?
3. ఈ కథలోని నీతి ఏమిటి ?

III. క్రింది ఖాళీలను పూరించండి.

1. ఒక ______________________ ఒక ధనికుడు ఉండేవాడు.
2. ______________________ త్రాసును కాజెయ్యాలని అనుకొన్నాడు.
3. “నీ కొడుకును ______________________ తన్నుకుపోయింది.”
4. “గ్రద్ద ______________________ ఎలా తన్నుకుపోగలదు ?”

IV. బహువచనాలు వ్రాయండి.

1. పట్టణం – ________ 2. ధనికుడు – ________

3. సంవత్సరం – ________ 4. వర్తకుడు – ________

V. వ్యతిరేకపదాలు వ్రాయండి.

1. ధనికుడు × ________ 2. నష్టం × ________

3. స్నేహితుడు × ________ 4. తెలివి × ________

VI. క్రింది పదాలతో సొంతవాక్యాలు వ్రాయండి.

1. వ్యాపారం : ..........................................................

..........................................................

2. నిర్ణయించుకొను: ..........................................................

..........................................................

3. తన్నుకుపోవు : ..........................................................

..........................................................

4. ఆశ్చర్యపోవు : ..........................................................

..........................................................

VII. ప్రక్కన ఇచ్చిన అర్థం ఆధారంగా తారుమారుగా ఉన్న అక్షరాలను సరిచేసి పదాలను వ్రాయండి.

1. తుస్నేడుహి = మిత్రుడు : ________

2. మానంఅను = సందేహం : ________

3. నికుడుధ = ధనవంతుడు : ________

VIII. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. ధనవంతుడు ఆఊరు వదలి వేరేచోటుకు ఎందుకు వెళ్లాడు ?
2. త్రాసును తిరిగి ఇవ్వమని అడిగిన ధనికునికి వర్తకుడు చెప్పిన సమాధానం ఏమిటి ?
3. ధనికుడు పన్నిన ఎత్తుగడ ఏమిటి ?
4. న్యాయస్థానంలో ఉన్న వారందరు ఎందుకు ఆశ్చర్యపోయారు ?

## వ్యాకరణము

నామవాచకం : మనుషుల యొక్కగాని, జంతువుల యొక్కగాని, పక్షుల యొక్కగాని, వస్తువుల యొక్కగాని పేర్లను తెలిపే పదాలను నామవాచకాలు అంటారు.

ఉదా : గోపి, రమణి, పుస్తకం, రాజుపాలెం, పెద్దపులి మొదలైనవి.